

టన్ను చీనీ రూ. 22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.4°/22.6°

జిల్లాలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం కార్పొరేషన్: చిరుధాన్యాల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో వంద మంది పొదుపు సంఘాల మహిళలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. చిరుధాన్యాలతో సమాజానికి ఆరోగ్యకర ఆహారం అందించవచ్చన్నారు. మహిళలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని హోం బేకర్స్‌గా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, సీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు రాధిక, జాతీయ జాయింట్ కార్యదర్శి అపర్ణ, శిరీష, ఝాన్సీ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎస్పీగా మాధవరెడ్డి



అనంతపురం క్రైం: జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా మాధవరెడ్డి నియమితులయ్యారు. విశాఖపట్టణం వెస్ట్‌జోన్ డీసీపీగా బదిలీ కావడంతో ఎస్పీగా ఉన్న కె. శ్రీనివాసరావు రెండు రోజుల క్రితం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో నియమితులైన కొత్త ఎస్పీ అన్బురాజన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. అప్పటి దాకా ఇన్‌చార్జ్ ఎస్పీగా శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

'డీసీఈబీ'లో విద్యార్థులను నమోదు చేయండి



మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

రాప్తాడురూరల్: అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థుల వివరాలను డీసీఈబీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు సూచించారు. గురువారం ఉపాధ్యాయ భవనంలో డీసీఈబీ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్టీ నిర్దేశాల ప్రకారం విద్యార్థుల నైపుణ్యాలకు సంబంధించిన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఎఫ్‌ఏ-2 పరీక్షలు అక్టోబరు 3 నుంచి 6 వరకు నిర్వహించేందుకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తదితరులున్నారు.

తాగునీటికే ప్రాధాన్యం





హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, రాజశేఖర్ రెడ్డి

- ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి
- అన్నదాతలను అధికారులు ప్రోత్సహించాలి
- జల చౌర్యం లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలి
- ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రైతులకు మేలు చేద్దాం : మంత్రి ఉషశ్రీచరణ్
- జెడ్పీలో ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనులశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని డీఆర్‌సీ భవనంలో సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి దామాషా ప్రకారం కేటాయించిన 26.828 టీఎంసీల్లో 10 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేటాయించాలన్నారు. 16.828 టీఎంసీలను పంటలకు ఇవ్వాలని ఆదేశించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా 40 టీఎంసీలు వస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 4 టీఎంసీలు తాగునీటి అవసరాలకు, మిగిలిన నీటిని చెరువుల ద్వారా పంటలకు ఇవ్వాలని సూచించారు. వీలైనంత వరకూ ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా ప్రోత్సహించి నీటిని పొదుపుగా వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. హెచ్చెల్సీ పరిధిలో గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, ఎంపీ సౌత్, నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, పీఏబీఆర్ కుడి కాలువలకు నిర్ణయించిన తేదీల ప్రకారం నీటిని విడుదల చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయం చేసుకుని నీటి చౌర్యాన్ని, వృథాను, అనధికారిక వాడకాన్ని అరికట్టాలని ఆదేశించారు. ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. యోగి వేమన, మిడ్‌పెన్నార్, బీటీపీ తదితర ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న రెయిన్‌గన్‌లను సేకరించి అవసరమైన రైతులకు అందించాలని పేర్కొన్నారు.

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేలా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. భైరవానితిప్ప ప్రాజెక్టు కింద పెండింగ్ భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాలకు సమానంగా నీటి పంపిణీ చేపట్టాలని ఆమె సూచించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ ప్రమీల, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్, హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్, సీపీఓ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, అగ్రికల్చర్ జేడీ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఫిషరీష్ డీడీ శాంతి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, నగర పాలకసంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో హెచ్చెల్సీ కింద ఉపకాల్వలకు నీటి విడుదలను సమావేశంలో ఖరారు చేశారు. వివరాలు..

కాలువ పేరు	నీటి విడుదల
ఎంపీ సౌత్‌కెనాల్	సెప్టెంబర్ 25 నుంచి
ఎంపీ నార్త్ కెనాల్	సెప్టెంబర్ 25 నుంచి
తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్	అక్టోబర్ 15 నుంచి
సీబీఆర్	నవంబర్ 1 నుంచి
పీఏబీఆర్ కుడికాలువ	డిసెంబర్ 1 నుంచి

కేసీ కెనాల్ కోటా తీసుకోవాలి

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో కేసీ కెనాల్ డైవర్షన్ కింద జిల్లాకు 10 టీఎంసీల నీటిని కేటాయించారు. జిల్లా హక్కుగా ఈ నీటిని కచ్చితంగా తీసుకోవాలి. హెచ్చెల్సీ కాలువ గట్లపై కంపచెట్లు పెరిగిపోతున్నాయి. వెంటనే వాటిని తొలగించాలి. కాలవపై నిరంతర గస్తీ కోసం లస్కర్లను నియమించాలి. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ముందుకు తీసుకెళ్లాలి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తాం

జిల్లాలోని 22 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే సాగు చేసిన పంటలను ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై అధికారులతో చర్చించాం. నిరంతరం అప్రమత్తం చేస్తున్నాం. గత రెండు, మూడు సంవత్సరాలుగా నీటి కోసం ఇబ్బందులు రాలేదు. ఈ ఏడాది మాత్రం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా వచ్చే నీటిలో తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించాం. ఇప్పటి వరకూ హెచ్చెల్సీ ద్వారా వచ్చిన నీటిలో తాగునీటి కోసం 3.43 టీఎంసీలు నిల్వ చేశాం. హంద్రీనీవా ద్వారా వస్తున్న నీటిని జీడిపల్లిలో స్టోర్ చేస్తున్నాం. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం. పంటలకు కూడా కేటాయించిన నీటిని సక్రమంగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎం. గౌతమి, జిల్లా కలెక్టర్

వైఎస్సార్‌కు రుణపడి ఉంటాం

రైతులు నష్టపోకుండా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి. రైతుల అభీష్టం మేరకు రెండు విడతల్లో సరఫరా చేస్తే మంచిది. వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. కాలవల్లో నీరు పారుతుంటే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తున్నారు. జిల్లాలో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత ఆయనదే. ప్రజలు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

– రాజశేఖరరెడ్డి, చైర్మన్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు

రైతులు నష్టపోకుండా చూద్దాం



జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే సాగు చేసిన ఉద్యాన, ఇతర పంటలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇందుకోసం అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

– తలారి రంగయ్య, ఎంపీ, అనంతపురం

రెయిన్‌గన్స్‌పై విచారణ చేయించాలి



గత ప్రభుత్వ హయాంలో రూ. 300 కోట్లు ఖర్చు చేసి రెయిన్‌గన్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం అవన్నీ ప్రైవేటు వ్యక్తుల గోదాముల్లో ఉన్నాయి. ఎన్ని కొనుగోలు చేశారు, ఎన్ని ఉన్నాయనే లెక్కలు తీయాలి. ఈ అంశంపై విజిలెన్స్ విచారణ చేయించాలి.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

నీటిని పొదుపుగా వాడుకోవాలి



రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. తాగునీటి అవసరాలకు హంద్రీనీవా నీటిని తీసుకుంటే ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి. ఎంపీఆర్, పీఏబీఆర్ గేట్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ ఏడాది దిగుబడి ఆధారంగా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా చర్యలు తీసుకోవాలి. తుంగభద్ర ఎగువన కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను నిలిపివేసేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలి.

– అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, అనంతపురం

పేరూరు డ్యాంకు నీరు విడుదల చేయాలి



చెరువులను నింపి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి. హంద్రీనీవా-2 కింద రాప్తాడు నియోజకవర్గంలో చెరువులకు, పేరూరు డ్యాంకు నీటిని విడుదల చేయాలి. పీఏబీఆర్ కింద పెండింగ్‌లో ఉన్న భూ సేకరణకు సంబంధించి పరిహారాన్ని అందించాలి. పాములాయి చెరువును లోకలైజేషన్ చేయాలి. హెచ్చెల్సీ సమాంతర కాలువ గురించి కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు చేయాలి.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే

నిధులు కేటాయించాలి



పీఏబీఆర్ కుడికాలువ కింద ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో 16 చెరువులకు నీటిని అందించాలి. చివరి చెరువు వరకూ నీటిని తీసుకెళ్లేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి. జిల్లేడు బండ రిజర్వాయర్ కింద భూసేకరణకు నిధులివ్వాలి. వైవీఆర్ రిజర్వాయర్ గేట్ల లీకేజీ మరమ్మతులకు రూ. 13 లక్షలు కేటాయించాలి. ఈ క్రాప్ బుకింగ్‌లో కొత్త సాఫ్ట్‌వేర్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలి.

– కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం

వృథా అరికట్టాలి



మిడ్‌పెన్నార్ గేట్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో నీరు వృథా అవుతోంది. వెంటనే గేట్ల మరమ్మతులు చేపట్టాలి. సుబ్బరాయసాగర్‌కు నీరు రావడం లేదు. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. సమయపాలనతో పెండేకల్లు, చాగల్లు, ముచ్చుకోట, సుబ్బరాయసాగర్ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాలి.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

చివరి ఆయకట్టుకూ అందించాలి



జిల్లాలో శింగనమల నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉంది. ఇక్కడ 46 చెరువులున్నాయి. అన్నింటినీ నీటితో నింపాలి. చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలవలకు పగుళ్లు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. వేలాది కుటుంబాలు ఆధారపడిన శింగనమల చెరువుకు నీరు విడుదల చేయాలి.

– జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్యే, శింగనమల

తాగునీరు పుష్కలంగా ఇవ్వాలి



గుంతకల్లు పట్టణ ప్రజలకు సరిపడేంతగా తాగునీరు ఇవ్వాలి. హెచ్చెల్సీ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నా జీబీసీ ద్వారా కేవలం 4 వేల ఎకరాలకు మించి ఇవ్వడం లేదు. హెచ్చెల్సీ, హంద్రీనీవా అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయకట్టుకు, చెరువులకు నీరందించాలి. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి.

– వై. వెంకట్రామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే

నేడు ఉద్యోగుల ప్రత్యేక స్పందన

అనంతపురం అర్బన్: కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశాల మేరకు ఉద్యోగుల ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ గాయత్రిదేవి తెలిపారు. కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

శిబిరం చిరునామా:
విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్,
డో.నం: 6-2-39, కోవూరునగర్, అనంతపురం.
ఫోన్ నంబరు : 9912220717

'బండారు' భూదాహానికి దివ్యాంగురాలి బలి

- రవికుమార్ మోసాన్ని సెల్ఫీలో వివరించి బలవన్మరణం



రాజమ్మ (ఫైల్)

బుక్కరాయసముద్రం: అధికారం ఉన్నా లేకపోయినా టీడీపీ నేతల ఆగడాలు ఆగడం లేదు. నేటికీ భూ దందాలకు పాల్పడుతున్నారు. అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారు. గత ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బండారు శ్రావణి తండ్రి బండారు రవి కుమార్ భూ దాహానికి తాజాగా ఓ దివ్యాంగురాలు బలైంది. తనకు జరిగిన మోసాన్ని ఆ అభాగ్యురాలు ఉరేసుకోబోతూ సెల్ఫీ వీడియోలో వివరించడం విషాదం నింపింది. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన నాగరాణి అలియాస్ రాజమ్మ (44) దివ్యాంగురాలు. ఆమెకు గ్రామ సర్వే నంబర్-218.2లో 3.67 ఎకరాల భూమి ఉంది. కొన్ని రోజుల క్రితం ఈ భూమిని రాజమ్మ తల్లి సాకే నాగమ్మ తన చిన్నాన్న అయిన బండారు నారాయణస్వామి వద్ద రూ. 25 వేలకు కుదువ పెట్టింది. అయితే, రూ. కోటి విలువ చేసే ఈ భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని నారాయణస్వామి కుమారుడు బండారు రవి కుమార్ భావించాడు. ఇటీవల నాగమ్మ మృతి చెందగా, కుదువ పెట్టిన భూమిని విడిపించుకునేందుకు 10 రోజుల క్రితం రూ. 25 వేలకు వడ్డీ, అసలు కలిపి రూ.1.25 లక్షలు తీసుకుని బండారు రవి కుమార్ ఇంటికి రాజమ్మ వెళ్లింది. అయితే, ఆ భూమి తమదని, వేరే వారికి అమ్మేస్తున్నామని ఆయన దౌర్జన్యం చేశాడు. దీంతో రాజమ్మ ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చేసింది. జరిగిన విషయాన్ని తన బంధువులతో చెప్పి బోరున విలపించింది. ఈ క్రమంలోనే గురువారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఉరేసుకునే ముందు తనకు జరిగిన అన్యాయాన్ని సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోలో వివరించింది. శింగనమల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి తండ్రి బండారు రవి కుమార్ తన భూమిని లాక్కున్నారని వాపోయింది. ఏవో మాటలు చెప్పి ఇటీవల తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నాడని ఆరోపించింది. రాజమ్మ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించింది. మృతురాలి సోదరుడు, ఎంపీటీసీ నాగేంద్ర సమాచారం మేరకు సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజమ్మ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఎల్లో మీడియాది తప్పుడు ప్రచారం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం



అనంతపురం సెంట్రల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్ట్ అయినప్పటి నుంచి ఓ వర్గం మీడియా గగ్గోలు పెడుతోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం ఎంపీ గోరంట్ల మాధవ్ అనంతపురంలోని తన నివాసంలో మంత్రితో పాటు పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్యేలు వై. వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులకు తేనేటి విందునిచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ... చంద్రబాబు అరెస్ట్ తర్వాత రాష్ట్రం అతలాకుతలం అవుతోందంటూ ఓ సెక్షన్ ఆఫ్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నిరసన తెలపడానికి టీడీపీ నాయకులే ముందుకు రావడం లేదన్నారు. దీంతో ఆ పార్టీ ముఖ్యనాయకులే విచారం వ్యక్తం చేస్తున్నారన్నారు. కానీ ఓ వర్గం మీడియా మాత్రం తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు పట్టిన గతే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు పడుతుందని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ హెచ్చరించారు. పిల్లనిచ్చిన మామకే చంద్రబాబునాయుడు వెన్నుపోటు పొడిచాడని గుర్తు చేశారు. నందమూరి హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌కు జరిగిన అవమానం త్వరలో పవన్ కళ్యాణ్‌కూ జరుగుతుందన్నారు. చంద్రబాబు అన్ని స్కాంలపైనా విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

పీజీ వైద్య పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు



శివప్రియాంకను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

అనంతపురం మెడికల్: పీజీ వైద్య పరీక్షల్లో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల పోస్టు గ్రాడ్యుయేషన్ (గైనకాలజీ) విద్యార్థి డాక్టర్ శివప్రియాంక సత్తా చాటారు. స్టేట్ టాపర్‌గా నిలిచి, బంగారు పతకం సాధించారు. గత నెలలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం పరీక్షలు నిర్వహించింది. రాష్ట్రంలోని 30 కళాశాలల నుంచి గైనకాలజీ విభాగంలో 186 మంది పరీక్షలు రాశారు. 700 మార్కులకు డాక్టర్ శివప్రియాంక 527 (75.29 శాతం) మార్కులు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, ప్రొఫెసర్ డాక్టర్ సంధ్యలు డాక్టర్ శివప్రియాంకను శాలువ, పూలమాలతో సన్మానించారు. శివప్రియాంక రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. డాక్టర్ శివప్రియాంక మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఇన్‌ఫెర్టిలిటీపై ఫెలోషిప్ చేసి భవిష్యత్తులో పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తాని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్రశౌరీ తదితరులున్నారు.

వివాహిత ఆత్మహత్య


గీత (ఫైల్)

గుత్తి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన ఈడిగ గీత (31)కు తొమ్మిదేళ్ల క్రితం అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గురుస్వామితో వివాహమైంది. సంతానం కలగకపోవడంతో కొంత కాలంగా తరచూ భార్యతో గురుస్వామి గొడవపడేవాడు. తొమ్మిది నెలల క్రితం పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలోనే మరో మహిళతో గురుస్వామి వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. విషయం తెలుసుకున్న గీత తండ్రి మునుస్వామి పలుమార్లు అల్లుడిని మందలించి, బుద్ధిగా కాపురం చేసుకోవాలని హితవు పలికాడు. అయినా గురుస్వామిలో మార్పు రాలేదు. బుధవారం రాత్రి గీతతో మరో సారి గురుస్వామి తీవ్ర స్థాయిలో గొడవపడడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె భర్త నిద్రలోకి జారుకున్న తర్వాత ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం వేకువజామున 4.30 గంటలకు నిద్రలేచిన భర్త... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న గీతను గమనించి, చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మునుస్వామి ఫిర్యాదు మేరకు గురుస్వామిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి
- రాప్తాడు నియోజకవర్గ సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, విప్ కాపు, ఎంపీ మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి

అనంతపురం సెంట్రల్: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. జెడ్పీలోని డీపీఆర్సీ భవనంలో గురువారం రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు పెద్దిరెడ్డి, కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, కలెక్టర్ ఎం.గౌతమి పాల్గొన్నారు.
మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ... దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సమన్వయం చేసుకుని అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండు మూడు రోజుల్లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న విద్యుత్ ఏఈ పోస్టుల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలో 111 మంది రైతులకు దాదాపు రూ. 93 లక్షలు విలువజేసే డ్రిప్, స్పింక్లర్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.
ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏబీఆర్ నుంచి చిన్మయనగర్, రాప్తాడు మండలం, పాపంపేట, రాచానుపల్లి తదితర పంచాయతీల పరిధిలోని ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. ఐటీ కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన టెక్నుల్స్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఏపీఐఐసీ పార్క్‌లో 10 ఎకరాలు, శౌరి ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ ఇండస్ట్రీ కోసం కూడా భూమిని కేటాయించాలన్నారు. 90 రోజుల్లో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం కింద అనంతపురం రూరల్ పరిధిలో 3,600 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. మరో నాలుగు వేల గృహ నిర్మాణాలకు డీపీఆర్ పంపడం జరిగిందని, వెంటనే మంజూరు చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించి పదివేల గృహాల అవసరం ఉందని, ఇందుకోసం అవసరమైన భూమిని కొనుగోలు చేయాలన్నారు. ఈ ఏడాది రైతులకు దిగుబడి ఆధారంగా పంటల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువకు అక్టోబర్‌లో నీటిని విడుదల చేయించాలన్నారు. హెచ్ఎల్ఎంసీ నుంచి పేరూరు డ్యామ్‌కు ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తే నియోజకవర్గంలోని 250 గ్రామాల పరిధిలో భూగర్భజలం పెరుగుతుందన్నారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు మార్కెట్ యార్డ్‌ను మంజూరు చేయాలన్నారు.రాప్తాడు మార్కెట్ యార్డ్‌కు అవసరమైన భూమిని కేటాయించాలన్నారు. సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయించాలని విన్నవించారు.
కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీపీఓ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ మధుసూదన్, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఫిషరీష్ డీడీ శాంతి, ఎల్‌డీఎం సత్యరాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, రాప్తాడు నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన


అంగన్‌వాడీ చిన్నారులు, సిబ్బందితో బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

కళ్యాణదుర్గం: స్థానిక వడ్డే కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. తన పర్యటనలో భాగంగా సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ ఓబుళమ్మతో కలసి అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్న ఆయన.. సిబ్బంది పనితీరు, చిన్నారులు, బాలింతలు, గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పోషకాహార పథకాలు, లబ్ధిపై ఆరా తీశారు. చిన్నారుల నైపుణ్యాలను పరీక్షించారు. అనంతరం చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. సాయంత్రం మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌ను గౌరవప్రదంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు.

పోలీసుల అదుపులో రైస్ పుల్లింగ్ ముఠా

అనంతపురం క్రైం: స్థానిక నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో రైస్ పుల్లింగ్ పేరుతో మోసం చేయబోయిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు నగరానికి చెందిన నలుగురు యువకులు, ఓ వృద్ధుడు కలసి ఆర్‌పీ పేరుతో ఓ వస్తువును లక్షలాది రూపాయలకు అమ్మకానికి పెట్టారు. ఇత్తడి చెంబుకు కవర్ చుట్టి మోసం చేయాలని చూశారు. అదే సమయానికి సమాచారం అందుకున్న నాల్గో పట్టణ పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, పోలీసుల అదుపులో ఉన్న వారందరూ నగరానికి చెందిన వారేనని తెలిసింది. ఎవరిని మోసం చేయాలనుకుంది... ఎంత డబ్బు చేతులు మారుతోందన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

పాము కాటుతో యువకుడి మృతి

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లి పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల మేరకు... కుందుర్పి మండలం మందలపల్లి గ్రామానికి చెందిన కర్రెన్న (35) బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్ గ్రామంలో నివాసముంటూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం రైతు వెంకటరెడ్డి దానిమ్మ తోటలో పంట కోతకు పనుల్లో నిమగ్నమైనప్పుడు పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న తోటి కూలీలు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ సూచన మేరకు బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా, కర్రెన్నకు భార్య రోజమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నెల రోజుల క్రితమే రోజమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

నానో యూరియాపై దృష్టి సారించాలి

అనంతపురం అగ్రికల్చర్: నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులు దృష్టి సారించాలని పలువురు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో రైతులు, డీలర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ ఏడీ బీఎంబీ నరసింహారావు, ఇఫ్కో కంపెనీ సీనియర్ డీజీఎం ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ టి.శ్రీధర్‌రెడ్డి, రీజనల్ అగ్రానమిస్ట్ ఎస్.సాయిప్రసాద్, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అనేక ప్రయోజనాలు చేకూర్చేందుకు నానో యూరియా, డీఏపీ తీసుకొచ్చిందన్నారు. పోషకాలు, పంటలకు జరిగే మేలు, రైతులకు ఒనగూరే ప్రయోజనాల గురించి తెలియజేశారు. 500 మి.లీ బాటిల్‌లో అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీలు 50 కిలోల బస్తాకు సమానమన్నారు. ధర కూడా తక్కువగానే ఉన్నందున పంటల్లో విరివిగా వినియోగించాలని సూచించారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్‌లు

అనంతపురం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలో ఈ నెల 12న జరిగిన అండర్-10, అండర్ -12 మినీ స్టేట్ లెవల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో దుర్గా విహాన్ యాదవ్, అంజనీ శ్రీ మనోగ్న, కౌశిక్ సత్తా చాటి రజత పతకాలు సాధించారన్నారు. వారిని జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. క్రీడాకారులను కోచ్‌లు ఏ. రాహుల్ బాబు, వి. ప్రబంధ అభినందించారు.

ఏపీ వ్యకాసం జిల్లా అధ్యక్షుడిగా రంగయ్య

తాడిపత్రి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా తాడిపత్రికి చెందిన రంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం సీపీఐ నాయకులు తెలిపారు. ఇటీవల తాడిపత్రిలో జరిగిన సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా తనను రెండో సారి ఎంపిక చేయడంపై రంగయ్య హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ కళ్యాణ్ రాజకీయ అసమర్థుడు

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం క్రైం: టీడీపీ, జనసేన పార్టీ రానున్న ఎన్నికల్లో కలసికట్టుగా ముందుకెళ్తాయని ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రకటించి మరోసారి తానొక రాజకీయ అసమర్థుడని నిరూపించుకున్నారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. లోకేష్, పవన్ కళ్యాణ్ ప్రెస్‌మీట్ చూస్తుంటే రాజకీయ నిరుద్యోగి, మానసిక రోగి కలసి నిర్వహించినట్లుగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీలు పొత్తుతో ముందుకెళ్తాయన్న విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఏనాడో చెప్పిందన్నారు. 2009 నుంచి పవన్ కళ్యాణ్ ప్యాకేజీ రాజకీయాలు చేస్తూ యువత భవిష్యత్తుతో ఆటలాడిన ఓ ఆర్థిక నేరస్తుడిని వెనకేసుకొస్తుండడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ఆర్థిక నేరాల్లో తన వాటా ఎంతుందో చెప్పాలని పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించారు. జాబు రావాలంటే బాబు రావాలని నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు పట్టుమని 10 వేల ఉద్యోగాలు కూడా కల్పించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలన్నీ భర్తీ చేస్తున్నారన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే నిజాయితీ గల పోలీసు అధికారులు చూస్తూ ఊరుకోరన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. జనసేన, టీడీపీల లోపాయికార ఒప్పందాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను భూస్థాపితం చేయడం ఖాయమన్నారు.

అన్నదమ్ముల దుర్మరణం


ప్రదీప్


దిలీప్ (ఫైల్)

నల్లమాడ: బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కన్నబిడ్డలిద్దరూ ఒకేసారి మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం కురుమాల గ్రామానికి చెందిన చాకలి సంగాల లలితమ్మ, చెన్నకేశవులు దంపతులకు ప్రదీప్, హర్షవర్ధన్, దిలీప్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఐటీఐ పూర్తి చేసిన పెద్ద కుమారుడు ప్రదీప్ (25), మూడో కుమారుడు దిలీప్ (23) తొమ్మిదేళ్ల క్రితం బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నారు. ప్రదీప్‌కు మూడేళ్ల క్రితం నల్లమాడ మండలం పాతబత్తలపల్లికి చెందిన లక్ష్మితో వివాహమైంది. దిలీప్ అవివాహితుడు. అన్నదమ్ములు ఒకే ఇంట్లో ఉంటూ విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 6.30 గంటలకు అన్నదమ్ములిద్దరూ ఒకే ద్విచక్ర వాహనంపై విధులకు వెళుతుండగా మార్గమధ్యంలో ఓ ట్రక్కు ఢీకొంది. తలపై చక్రం వెళ్లడంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను స్థానికులు నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందేలోపు ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలియగానే కురుమాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంత ఘోరం జరిగిపోయిందో అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన బెంగళూరుకు తరలి వెళ్లారు. బాధిత కుటుంబసభ్యులకు ఆస్తనిక వైఎస్సార్‌సీపీ నేత కె.రాజారెడ్డి అండగా నిలిచారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గురువారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి


మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి

కళ్యాణదుర్గం రూరల్: బాల్య వివాహాలు అరికట్టాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి అన్నారు. ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. డ్రాపౌట్ లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీఆర్పిలతో సర్వే చేయించి బడిలో చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులతో కమ్యూనిటీ లెవెల్ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. విద్య ప్రాముఖ్యత తెలియజేసి పిల్లలను బడులకు పంపేలా తల్లిదండ్రుల్ని ప్రోత్సహించాలన్నారు. బాలల సంక్షేమ సమితి వారికి దీర్ఘకాలిక పునరావాసం అందిస్తుందన్నారు. బడి మానేసిన పిల్లలు వృత్తి విద్యా కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం బాలికల కోసం ఎన్నో వసతులతో కూడిన హాస్టళ్లు ఏర్పాటు చేసిందన్నారు. సంక్షేమ పథకాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఎంఈఓ విజయ కుమారి, సీఐ తేజమూర్తి, జిల్లా బాలల పరిరక్షణ సమితి డీసీపీఓ సుబ్రమణ్యం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణమాచారి, కౌన్సిలర్ సురేష్, ఇర్ఫాన్, డీసీపీయూ సోషల్ వర్కర్ వెంకటకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డెంటల్ టెక్నీషియన్ ఎంపిక నిలుపుదల

అనంతపురం మెడికల్: పారామెడికల్ పోస్టుల భర్తీలో భాగంగా డెంటల్ టెక్నీషియన్ పోస్టుకు అర్హుల ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేశారు. ఈ మేరకు డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ గురువారం ఓ ప్రకటన జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

అనంతపురం మెడికల్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వలంటీర్లు సర్వే నిర్వహించి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తారన్నారు. ఏఎన్ఎం, సీహెచ్ఓలు ప్రత్యేక యాప్‌లో ఆ వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. ఈ నెల 30 నుంచి జరిగే 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపుల్లో రోగులకు స్పెషలిస్టు, మెడికల్ ఆఫీసర్లు వైద్య పరీక్షలు నిర్వ

బీబీ జైనబ్బీ దర్గాకు విరాళం


రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన హజరత్ బీబీ జైనబ్బీ ఉరుసు ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం పాల్గొన్నారు. అమ్మవారి దర్గా అభివృద్ధికి గతంలో ఇచ్చిన మాట మేరకు తన తనయుడు వై.ప్రణయ్‌రెడ్డితో కలసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి అమ్మవారికి చాదర్, పూలమాలను భారీ ఊరేగింపు నడుమ తీసుకెళ్లి, ప్రత్యేక ప్రార్థనల అనంతరం చాదర్‌ను దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, కోశాధికారి జెండా జిలాన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జీఎంఎస్ మీరంబాషా, కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, మోమిన్ జిలాన్, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షెక్షావలి, దర్గా గౌరవ సలహా సభ్యుడు పామిడి జాకీర్, అయ్యార్ దాదు, వన్నూర్ సాబ్, తాషా ఖాదర్‌బాషా, బేల్దార్ శర్మాస్, గంగవరం శర్మాస్, వడ్ల సలీం, అన్వర్, బళ్లారి ఆసీఫ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లలితమ్మ, నాయకులు తిప్పయ్య, ఏసీ ఎర్రిస్వామి, గోవిందు, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్'తోనే యువకుడి మృతి

- నిర్ధారించిన జిల్లా వైద్యాధికారులు

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన యువకుడు మధు స్క్రబ్ టైఫస్ (ఓరియంటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా ద్వారా సోకిన జ్వరం)తో బాధపడుతూ మృతి చెందినట్లుగా శ్రీసత్యసాయి జిల్లా వైద్యాధికారులు నిర్ధారించారు. ఇటీవల బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధు మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని, అందుకు గల కారణాలను ఆరా తీసేందుకు జిల్లా సర్వేలైన్స్ ఆఫీసర్ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్, మండల వైద్యాధికారి పుష్పలత గురువారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బెంగళూరు వైద్యులు ఇచ్చిన రికార్డు పరిశీలించి స్క్రబ్ టైఫస్‌తోనే మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై స్థానికులు, వైద్య సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, వంటీర్లకు అవగాహన కల్పించారు. వ్యాధిని తేలిగ్గా తీసుకోకూడదన్నారు. ఈ వ్యాధి విస్తరించకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మద్యం అక్రమ రవాణా అరికట్టండి

- సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


సెబ్ అధికారులతో సమావేశమైన డీసీ నాగమద్దయ్య

రాయదుర్గం: మద్యం అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని సెబ్ అధికారులు, సిబ్బందిని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. రాయదుర్గం సెబ్ పోలీస్‌స్టేషన్‌ను డీటీఎఫ్ సీఐ శ్రీనివాసులుతో కలసి గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కేసుల పురోగతి, మద్యం అక్రమ రవాణా కట్టడికి చేపట్టిన చర్యలపై స్థానిక సీఐ జయనాథ్‌రెడ్డితో ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మద్యం కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ కర్ణాటక మద్యం ఏపీలోకి ప్రవేశించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ రవాణా చేపట్టే వారిని గుర్తించి పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. అనంతరం డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో సీఐలు నరసనాయుడు, నాగేంద్రప్రసాద్, గోపీకృష్ణ, ఎస్ఐ హరికృష్ణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. హించి, సమస్య తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తారని పేర్కొన్నారు.

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



రాప్తాడు: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

రాప్తాడు: సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రం రాప్తాడులో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్రా వెంకటేష్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతితో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ గ్రామస్తులు ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలకరించారు. నూతన పింఛన్లను పంపిణీ చేశారు.

ఇద్దరూ కలిసి పోటీ చేసినా ఒరిగేదేమీలేదు..

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ కలిసి పోటీ చేసినా ఒరిగేదేమీ లేదని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలుపొందుతారని ఎమ్మెల్యే అన్నారు. 2014లో పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేయలేదని, చంద్రబాబు జెండా పట్టుకొని దేశమంతా తిరిగి ఆయన్ను గెలిపించాడన్నారు. 2019లో మళ్లీ పవన్ కళ్యాణ్ ఒంటరిగా పోటీ చేసి చంద్రబాబు దుర్మార్గుడు, దోపిడీ దారుడు, రూ.లక్ష కోట్లు తిన్నాడంటూ ప్రజల్లో ప్రచారం చేశాడన్నారు. మళ్లీ చంద్రబాబుతో కలిసి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ పవన్, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహగౌడ్, మన్నల వరలక్ష్మీ, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, స్థానిక నాయకులు సాకే చంద్రా, చింతకాయల జయన్న, చిరుతల నాగేంద్ర, మన్నల రవి, నారాయణ, ఎల్ఐసీ వెంకటరాముడు, కుమ్మర రాము పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనంతపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం ఎ.నారాయణపురం పంచాయతీలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా వలంటీర్లు ఈనెల 15 నుంచి 30 వరకు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి సర్వే పక్కగా నిర్వహించి వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించాలని ఆదేశించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి 30 వరకు సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, 14 రకాల వైద్య సేవలు అందించడంతోపాటు 105 రకాల మందులు పంపిణీ చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు.

నగరానికి దీటుగా అభివృద్ధి..

నగరానికి దీటుగా ఏ నారాయణపురం పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. రూ. 28 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం నూతన పింఛన్లను పంపిణీ చేశారు.వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు నాగేంద్ర, శృతి, మహబూబ్ జాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, హాజీవలి, సత్తన్న, గువ్వల రామకృష్ణారెడ్డి, డీవీ సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, జయప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అనంత'ను కరువు జిల్లాగా ప్రకటించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు గురువారం స్థానిక టవర్ క్లాక్ వద్ద ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ వర్షాలు కురవకపోవడంతో పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, ఆర్‌వీనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, కృష్ణమూర్తి, రామిరెడ్డి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఆత్మకూరు: ఆత్మకూరులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల పోతన్న గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉదయం 7 గంటలకే ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం నుంచి మండల కేంద్రంలో నూతనంగా మంజూరయిన పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చన చేస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: శ్రావణ బహుళ అమావాస్యను పురస్కరించుకొని అభినవ కుల సుందరీ పీఠం ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో జరిగింది.తపోవనంలోని పీఠం ప్రాంగణం చంపకాసదన్‌లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సామూహిక లక్ష కుంకుమార్చన, శ్రీచక్రార్చన జరిగాయి. సామూహిక లలిత సహస్రనామ పారాయణం శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపురావడంపై నాయకులు సంబరాలు చేసుకున్నారు. గురువారం ఆర్టీసీ డిపో ఎదుట బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు దివాకర్‌రావు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు చెన్నప్ప, కోఆపరేటీవ్ జిల్లా చైర్మన్ మల్లరాయుడు, ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కల్లప్ప తదితరులు పాల్గొని, హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో ఐక్య ఉద్యమాలు చేపడతామని పిలుపునిచ్చారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్ క్లాక్: స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఎంఈఎఫ్ నాయకులు చలోఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ తలపెట్టిన చలో ఢిల్లీకార్యక్రమాన్ని ఎస్సీ ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఈనెల 18న చలోఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు సాకే అమర్నాథ్, జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్ర, జిల్లా కోశాధికారి దేవర పుల్లప్ప, నగర అధ్యక్షులు మీసాల నాగభూషణం, నగర ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, నగర ఉపాధ్యక్షులు రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భగవద్గీత సప్తాహం


భగవద్గీత పారాయణంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: స్థానిక రెవెన్యూకాలనీలోని కోదండరామాలయంలో శ్రీమద్భాగవద్గీత పారాయణ సప్తాహం గురువారం ముగిసింది. కేరళకు చెందిన ఆనందాశ్రమ చంద్రానందన్ మాతాజీ భగవద్గీత సాధన శిబిరంలో 18 అధ్యాయాలను వివరించారు. లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్వాహకులను అభినందించారు. వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, అనంత ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షులు పాలసముద్రం నాగరాజు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది హరికృష్ణ, మనూరు నాగరాజ శర్మ తదితరులు మాతాజీని సత్కరించారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంబరాలు


అనంతపురంలోని వేమన భవన్ ఎదుట సంబరాలు చేసుకుంటున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

అనంతపురం సిటీ: అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) ఉద్యోగులు గురువారం సంబరాలు చేసుకున్నారు. రెండ్రోజుల కిందట దేశ వ్యాప్తంగా జరిగిన బీఎస్ఎన్ఎల్ మెంబర్‌షిప్ వెరిఫికేషన్ ఎన్నికల్లో సంచార్ నిగమ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ (ఎస్ఎన్ఈఏ) ఘన విజయం సాధించినట్లు ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కె.లింగమయ్య ప్రకటించారు. బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్‌లకు మూడో వేతన సవరణ, ఎస్ఏబీ కాంట్రిబ్యూషన్, పదోన్నతుల సాధన కోసం కృషి చేస్తామని ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి రంగనాయకులు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా తమ సంఘానికి అండగా నిలిచిన ఎస్ఈడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి గోపాల్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎన్ఈఏ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, ఎస్ఈడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, సభ్యులు పాల్గొన్నారు.

17న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

అనంతపురం: అథ్లెటిక్ అసోసియేషన్ అడహక్ కమిటీ అనంతపురం జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 17న నీలం సంజీవరెడ్డి స్టేడియంలో అండర్–14,16,18, 23 విభాగాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఇస్మాయిల్ తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, క్రీడా పరికరాలతో ఉదయం 7:30 గంటలకు హాజరుకావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23 వరకు నాగార్జున యూనివర్సిటీ, గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేటి నుంచి నియోజకవర్గ క్రీడాపోటీలు

ఆత్మకూరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నరసింహారెడ్డి, పీడీలు రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం తొమ్మిది రకాల ఆటల పోటీలు (కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా, బ్యాడ్మింటన్) ఉంటాయన్నారు. ఈనెల 16న వంద మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1,500 మీటర్లు పరుగు పందెంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన వారు పాల్గొనాలన్నారు. అండర్ -14, అండర్-17 ఎంపికైన క్రీడాకారులు హాజరుకావాలని తెలిపారు.

గాడిచర్ల అడుగుజాడల్లో నడవాలి


గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు, సాహితీవేత్త, పత్రికా సంపాదకుడు అయిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ అన్నారు. గురువారం గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతి వేడుకలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎల్‌ఎం ఉమ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అనేక ఉద్యమాలు చేసి కారాగార శిక్ష అనుభవించారన్నారు. ఆంధ్రలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్ రెడ్డి, ఉపగ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకేలో 160 మందికి ఉద్యోగాలు

అనంతపురం రూరల్: స్థానిక పీవీకేకే కళాశాలలో గురువారం అలోహ టెక్నాలజీ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు, ప్రాంగణ నియామక అధికారి భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రాంగణ నియామకల్లో దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొనగా, ఆన్‌లైన్ పరీక్షలో 160 మంది అర్హత సాధించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ డెవలపర్స్‌గా పని చేయాల్సి ఉంటుందన్నారు. వారికి వార్షిక వేతనం రూ. 3.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఉంటుందన్నారు.

గొంతుకోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేసిన మంజునాథ్

అనంతపురం క్రైం: నగరంలోని డీమార్టు వద్ద మంజునాథ్ అనే వ్యక్తి గొంతుకొసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. నాల్గో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన మేరకు.. డీమార్టు వెనుక వైపున మంజునాథ్ కుటుంబం నివాసం ఉంటోంది. మధ్యాహ్నం భార్యతో గొడవపడ్డాడు. మనస్థాపంతో కత్తితో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గొంతుభాగం బాగా తెగడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. రక్తపు మడుగులో పడి ఉన్న అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నవ్య పరిశోధనలతోనే నూతన సమాజం


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: నవ్య పరిశోధనలతోనే నూతన సమాజం సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.నాగభూషణ రాజు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూరల్‌డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ), అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఎస్కేయూ సంయుక్తంగా ఇన్నోవేషన్ , ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నపుడే అపారమైన అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.జయచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రామకృష్ణా రెడ్డి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ చంద్రమౌళి, షహీన్, నర్రా శ్రీనివాస రావు, కిరణ్మయి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

30లోపు ఈ క్రాప్ నమోదు చేయించాలి


బి.యాలేరు వద్ద పంటను ఈక్రాప్ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 30లోపు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. గురువారం మండలంలోని బి, యాలేరు, మది గుబ్బ గ్రామాల వద్ద సాగు చేసిన పంటలను వ్యవసాయ అధికారులు ఈ క్రాప్ బుకింగ్ పనులను పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ కమిటీలో పలువురికి చోటు


కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి పార్టీ అధిష్టానం దృష్టిసారించింది. ఈ క్రమంలో ఇది వరకే నూతన జిల్లా కమిటీని విడుదల చేసింది. గురువారం కొత్తగా పలువురికి పార్టీలో చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా దూదేకుల బాబయ్య (తాడిపత్రి), జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి (అనంతపురం అర్బన్)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాకు 1,312 మెట్రిక్ టన్నుల యూరియా


ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారి కోటా మేరకు నాగార్జున కంపెనీకి చెందిన 1312 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు గురువారం సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను ఆయన పరిశీలించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఏఓ ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యతగా ఆర్బీకేలు, సహకార సంఘాలకు సరఫరా చేసి, మిగతావి హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేస్తామని తెలిపారు.

గొలుసు అపహరణకు విఫలయత్నం

అనంతపురం క్రైం: నగర శివారులోని విమలాఫరూక్ నగర్‌లో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న సంధ్య అనే మహిళను గుర్తు తెలియని వ్యక్తి కత్తితో బెదిరించి, ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నాడు. బాధిత మహిళ గట్టిగా కేకలు వేయగా, పొరుగింటి వ్యక్తి అప్రమత్తమై గొలుసు లాక్కెళ్తున్న వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. అయితే దొంగ.. గొలుసు అక్కడే వదిలేసి అడ్డుగా ఉన్న వ్యక్తిని తోసుకుని ఉడాయించాడు. తోపుదుర్తి గ్రామానికి చెందిన సంధ్య, చిరంజీవి దంపతులు విమలాఫరూక్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. చిరంజీవి అద్దెకు వాహనాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చిరంజీవి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై పలు అనుమానాలున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రేపు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయ పల్లి పంచాయతీలోని చిన్మయనగర్, కళాకారుల కాలనీ, ఆడిటర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఈ నెల 16న 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఓ ప్రకనటలో తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

రైతులకు పరిశోధన ఫలితాలు అందించండి


శాస్త్రవేత్తలతో వివరాలు తెలుసుకుంటున్న పాలకవర్గ సభ్యులు

బుక్కరాయసముద్రం: రైతులకు పరిశోధన ఫలితాలు అందించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పాలక వర్గం సభ్యులు డాక్టర్ మల్లికార్జున రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి శాస్త్రవేత్తలకు సూచించారు. గురువారం వారు రేలకుంటకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యసాయ పరిశోధనా స్థానం, రెడ్డిపల్లిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమయ్యే పరిశోధనలను చేయాలని శాస్త్రవేత్లకు సూచించారు. సమగ్ర వ్యవసాయం, చిరు ధాన్యాల సాగు, కంది, ఆముదం, సజ్జ, అలసంద, వేరుశనగ పంటలను పరిశీలించారు. తక్కువ ఖర్చుతో పంటల సాగుపై రైతులకు సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, రెడ్డిపల్లి కేవీకే కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నబీరసూల్‌కు బోయిభీమన్న పురస్కారం



అనంతపురం కల్చరల్: మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ బోయిభీమన్న జీవిత సాఫల్య పురస్కారాలకు తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య రంగంలో విశేష సేవలు అందించిన వారిని ఎంపిక చేశారు. అందులో భాగంగా నగరానికి చెందిన సీనియర్ కవి కంబదూరు షేక్ నబీరసూల్‌ను ఎంపిక చేశారు. వృద్ధాప్యం దృష్ట్యా సుదూర ప్రాంతానికి ఆయన వెళ్లలేకపోయారు. దీంతో ఆన్‌లైన్ ద్వారా బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం అందించారు. జ్ఞాపికను, ప్రశంసాపత్రం పోస్టల్ ద్వారా పంపనున్నట్లు మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి తెలిపారు. నబీ రసూల్‌ను పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలియజేశారు.



ఫ్యాషన్





వీలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్ సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్ట్రన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్



ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పాట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.

షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్ట్రన్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.





మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.



వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో
ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు...
వైవిధ్యభరితమైన
మరెన్నో స్వీట్లను తినిపించి
ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



పనస పాఠోలి



కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాఠోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలుపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాఠోలీ రెడీ.

బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.

పతిశప్త



కావలసినవి: మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.

సేమియా లడ్డు



కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.

స్వీట్ సందేష్



కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతుల తోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేష్ రెడీ.

కేసి మిథోయ్



కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.

తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి



విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో'
అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు.
పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది.
ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు.
తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది.
కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో
మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు.
కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధ పడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్పించింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పితే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్లు చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వా లేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీ మణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.



తల్లి మీనాతో విత్య, నిత్య

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.